# ఉప్పొంగిన సాగరం

"పెళ్లెప్పుడు చేసుకుందాం చెప్పునీలా"

"ఈ ప్రశ్న రోజుకి ఎన్నిసార్లడుగుతావ్ రవీ"

"ఎన్ని రోజులు అడిగించుకుంటావో నువ్ చెప్పు"

"బ్రహ్మదేవుడు మనిద్దర్నీ కలిపినప్పుడే లగ్నపత్రిక రాసేసి వుంటాడు. ఆ పత్రికని ఇంకో బ్రాహ్మలాయన ఎవరో ట్రాన్సిలేట్ చేసి మనిద్దర్నీ ముడెట్టి– నీచేత మూడుముళ్లు వేయిస్తాడు– అంచేత నువ్వు ఆత్రపడినా.. నేను ఆపినా.. టైమొచ్చేవరకూ.. ఎవరికి ఎవరో.."

"ఏంటి బామ్మా... ఇంత వేదాంతం ఎప్పుణ్ణేర్చుకున్నావే"

కిలకిలా నవ్వింది– అతను అడిగిన తీరుకి.

రామకృష్ణాబీచ్ అలల– గల గలల్తో నీల నవ్వు పోటీ పడింది! సముద్రపు నీళ్లొచ్చి వాళ్లని అందుకుందామని తాపత్రయపడుతున్నాయి.

అందుకోలేక వెనక అడుగువేస్తున్నాయ్.

నవ్వుతూన్న నీల నీలాల కన్నుల్లో ఉప్పునీరు పొంగింది.

ఇసక మీద కుప్పకూలిపోతూ వెక్కెక్కి ఏడిచింది.

రవి కంగారు పడలేదు. ఏడాదిగా ప్రేమిస్తున్న రవికి ఇదేం కొత్తకాదు. ఉండుండి నవ్వుతుంది. ఒక్కోసారి ఏడుస్తుంది. రెండు ఫీలింగ్స్‌నీ చలించకుండా భరించడం రవి అలవాటు చేసుకున్నాడు.

మామూలుగా ఉన్నప్పుడు ప్రేమపాఠాలు వల్లిస్తాడు. ఏడుస్తూంటే మౌనంగా దిక్కులు చూస్తాడు. సముద్రం అలల్నీ ఆమె కన్నీళ్లనీ కంట్రోల్ చేయడం కష్టమే- అలలు తగ్గేవరకూ అలా వేచి వుండటం అలవాటైపోయింది. క్షణంలో మళ్లీ మామూలే- నవ్వులూ జోకులూ...

రవి పట్టువదలని ప్రేమమార్కుడు-

నీల కంటపడ్డాక నాలుగు నెలలు ఆమెని పలకరించడానికి కృషి చేశాడు.

పరిచయమైన నెల్లాళ్లకి ఆమె తలపుల్లో స్థానాన్ని సంపాదించు కున్నాడు- ఇంకొన్నాళ్లకి గుండెల్లో తిష్టవేశాడు.

నీలకి రవిలో నచ్చిన గుణం అదే- తన ప్రేమకోసం పడిగాపులు పడుతున్నాడు- ఒక్కరోజు కూడా తొందరపడలేదు- పెళ్లి నుంచి మొదలెట్టి ప్రేమ అన్నాడు గానీ.. ప్రేమతో మొదలెట్టి పెళ్లి మాటలు వల్లించలేదు- తను నవ్వుతున్నా పులకించి ముట్టుకోలేదు. ఏడుస్తున్నా అక్కున చేర్చుకుని కన్నీరు తుడవాలని ప్రయత్నం చేయలేదు. అందుకే రవి మీద అపారమైన అనురాగం అల్లుకుంది- అతనితో కలల విహారం చేసింది.

"అతను పెళ్లెప్పుడు.." అని అడిగినప్పుడల్లా అతన్ని నిరుత్సాహ పరుస్తున్నందుకో.. తన పరిస్థితికోగాని గుండెల్లోంచి దుఃఖం తన్నుకొస్తుంది నీలకి.

అవును... నీలకి పెళ్లంటే భయం-

క్రితం ఏడాది.. అంటే.. బి.ఎస్సీ రెండో సంవత్సరం చివరి పరీక్షలో వుండగా.. తన అక్క ప్రమీలకి పెళ్లి- పరీక్ష అయినరోజు సాయంత్రమే వైజాగ్‌లో ట్రైనెక్కింది-

రాత్రంతా నిద్రపట్టలేదు- 3:20!!! ఈపాటికి సుముహూర్తం అయిపోయి వుంటుంది. 3:40 ఇప్పటికి మంగళసూత్రధారణ అవుతుంది.

3:50 తలంబ్రాలు- అక్కతో తలంబ్రాలు రెచ్చిపోయి పోయాలని పెద్ద సీనియర్‌లా హెచ్చరిచ్చింది!

"వీడియో చూద్దుగానే మహాతల్లీ నువ్ ట్రైన్ దిగేటప్పటికి మధుపర్కాలలోనే ఉంటాం గనుక.. నువ్వొచ్చాక మళ్లీ తలంబ్రాల సీను రీటేక్ చేస్తాంలే- నువ్వెళ్లు- పరీక్ష బాగా రాయి" అని గెంటేసింది అక్క ప్రమీల.

నీలకి నవ్వొచ్చింది. అక్క 'రీటేక్' అని వాడిన పదానికి.

అక్క చక్కగా ఉంటుంది- డ్యాన్సు నేర్చుకుని ప్రదర్శనలు కూడా ఇస్తుంటుంది- షడన్‌గా.. ఓ మెగా సీరియల్‌లో వేషం ఆఫర్ వచ్చింది ప్రమీలకి.. హీరోయిన్ పాత్రకి డ్యాన్సర్ కావాలని ఆమె వెంట పడ్డారు..

"నేను డ్యాన్స్ మాత్రమే నేర్చుకున్నా- పాటకి అభినయం- నట్టువాంగానికి పాదాలు కదపడం- పదాలకి సంచారీలు చేయడం ఇంతకన్నా నాకేం రాదు- మీ కెమేరా అంటేనే నాకు భయం- డైలాగ్ బట్టీపట్టి ఎక్స్‌ప్రెషన్తో చెప్పడం నావల్లకాదు" అంది వచ్చిన డైరెక్టర్‌గారితో.

"మీకేం భయం అక్కర్లేదు కేశిరాజుగారి ఇనిస్టిట్యూట్‌లో మూణ్నెల్ల కోర్సులో జేర్పిస్తాను. వాళ్లు మీకీ భయాలన్నీ పోగొడతారు" అని నచ్చ

చెప్పాడు డైరెక్టరు!

అక్క ఇనిస్టిట్యూట్‌లో చేరింది... అందుకే 'రీటేక్' అనే పదం వాడింది. నవ్వుకుంది నీల.

తెలతెలవారుతుండగా సికింద్రాబాద్ స్టేషన్ వచ్చింది రైలు. బేరమాడకుండా ఆటో ఎక్కేసింది.

మధుపర్కాల్లో అక్కాబావల్ని చూడాలన్న ఆత్రం.

బావ రజని బావుంటాడు- అక్కయ్య జేరిన ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ స్టూడెంటే-

మూణ్నెళ్ల కోర్సులో ఆరునెల్ల పరిచయం పెంచుకున్నారు ఇద్దరూ.

అమ్మకి వంట్లో బాగోలేదు. అక్క పెళ్లైనా చూడాలని ముచ్చటపడితే అక్క రజనీతో పెళ్లి చేయమంది- హడావుడిగా ముహూర్తం పెట్టేసి అంతకన్నా హడావుడిగా వెళ్లిపోవాలని అమ్మ తాపత్రయం.

'శుభమా' అని పెళ్లి పూటా అమ్మ వెళ్లిపోవడం గురించి ఆలోచించాలని లేదు- కానీ మనసు సెకన్‌కి కొన్ని వేల సంవత్సరాలు ముందుకూ వెనక్కీ వెళ్తుంది- దుఃఖాలూ సుఖాలూ ఊహించేస్తుంది. 'ఛీ! పాడు మనస్సు' అనుకుని మనసుని అరక్షణంలో పెళ్లిలోకి తీసుకుంది.

ఆటో కూడా ఇంటి దగ్గర ఆగింది.

✢ ✢ ✢

ఇంటి ముందు టెంట్- పెళ్లి పందిరి కాదు-

పెళ్లి కోలాహలం లేదు- గోల గోలగా శోకాలు వినపడుతున్నాయి.

అమ్మ చనిపోయిందా- గతుక్కుమంది నీల మనస్సు.

కానీ చనిపోయింది తల్లికాదు- పెళ్లికొడుకు రజని!!

అక్కతోపాటు యాక్టింగ్ ఇనిస్టిట్యూట్‌లో చదువుతున్న శేఖర్ రజనీని పొడిచి చంపేసి పరారీ అయిపోయాట్ట! నీలకి తన చుట్టూ నేల తిరుగుతోంది. నిలబడలేక అక్క దగ్గర కుప్పకూలిపోయింది.

ఇంట్లో జనంకన్నా వీధిలో జనం పెరిగారు. పెళ్లికొచ్చిన చుట్టాలంతా ఈ హత్యకేసుకు సాక్ష్యం చెప్పాలని భయంతో పారిపోతున్నారు.

పెళ్లి బొట్టుతో బుగ్గమీద చుక్కతో రజనీ శవం.

కల్యాణ తిలకంతో పట్టుచీరతో అక్క దుఃఖం-

పోలీసులొచ్చారు. పోస్టుమార్టం అయ్యాకే దహనం అన్నారు- ఏడుస్తూ... పెళ్లికొడుకు తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కి వెళ్లారు.

అక్కడి నుంచి హాస్పిటల్‌కి పరిగెట్టారు- అక్కణ్నుంచి స్మశానికి వెళ్లి వుంటారు. ఇవన్నీ నీల కనవసరం. కావలసిన ఆనందం దొరకనప్పుడు అక్కర్లేని విషయాలు తలకెత్తుకుని విచారించడం వద్దనుకుంది. కానీ అక్కని చూస్తుంటే ఎంతొద్దనుకున్నా గుండె చెరువవుతోంది. అక్క- రజనీ ఒకళ్లనొకళ్ళు ఎంత ఇష్టపడ్డారో నీలకి బాగా తెలుసు.

అమ్మ చివరి కోరిక ఏమోగానీ అక్క జీవితం కల్లోలమైపోయింది. అన్యాయంగా రజనీ బలైపోయాడు. “అంతమందిలో అసలు హత్యచేసిన శేఖరెవరక్కా!” అని చాలాసేపటికి అడిగింది ప్రమీలని ఓదారుస్తూ.

“ఆ దుర్మార్గుడు మా ఇనిస్టిట్యూట్‌లోనే చదివేవాడు. రజనీ, నేను స్నేహంగా ఉండటం వాడికి నచ్చేది కాదు. ఐ లవ్ యూ అంటూ వెంటపడేవాడు. రెండుసార్లు మా ప్రిన్సిపాల్‌కి రిపోర్టు చేసాను. ఆయన వాడ్ని మందలించి సరిచెయ్యడానికి ప్రయత్నించారు. కానీ వాడు

మొండిఘటం. పట్టిన పంతం విడవలేదు. ఇనిస్టిట్యూట్ ముందే పంతం పట్టినట్టు రెండ్రోజులు నిద్రాహారాలు మాని నిలబడ్డాడు. మా అందరికీ భయమేసింది. మా సారూ, రజనీ వచ్చి 'మనం నటన వృత్తిలో ఉన్నాం. ప్రేమించినట్లు నటించు' అని నాకు చెప్పారు. ఎలాగోలాగ వాడి పంతాన్ని విడగొట్టాము. తరువాత ఇనిస్టిట్యూట్‌కి సెలవుపెట్టి ఇంటికొచ్చేసాను.

అమ్మ నా పెళ్ళి చూడాలని బాధపడడం మొదలెట్టింది. రజనీని పిలిచాను. హడావుడిగా పెళ్ళి చేసుకోవలసి వచ్చింది. రజనీ ఇంట్లోవాళ్లు కూడా అభ్యంతరపెట్టకపోవడంతో ఆనందంగా పెళ్ళి జరిగిపోతుందని అనుకున్నా! కానీ..."

వెక్కి వెక్కి ఏడ్చింది ప్రమీల. "శేఖర్ మర్డర్ చేసి పారిపోయాడు" భోరుమంది.

+ + +

"పెళ్ళెప్పుడు చేసుకుందాం నీలా.." పది రోజుల తర్వాత మళ్ళీ అడిగాడు. ఈసారి సముద్రపు అలలు ఆమె కళ్లల్లో పొంగలేదు.

ఏడాది క్రింద తనింట్లో జరిగిన విషాదాన్ని రవికి చెప్పింది.

"అంతే కదా! పెళ్లి వేడుకలు, వైభవాలు నీ మనస్సు వప్పుకోదు. మనిద్దరం దేవుడి ముందు దండలు వేసుకుందాం. దేవుడు ఆశీర్వదించాక మీ అమ్మానాన్నల ఆశీర్వాదం తీసుకోవడానికి వెళ్దాం. మీ అక్క కూడా గుండెనిండా ప్రేమతో నిన్ను ఆశీర్వదిస్తుంది"

రవి మాటలు నిజమేమోననిపించింది.

నిజమే అనిపించింది.

అదే సబబు అనిపించింది.

గుళ్లో పెళ్లయింది. విశాఖపట్నం నుంచి హైదరాబాదు చేరుకున్నారు కొత్త దంపతులు.

ప్రమీల చెల్లాయిని, చెల్లాయి భర్తని చూసింది. భూమి బద్ధలైతే బావుండుననిపించింది. తన ప్రాణంపోతే బావుండుననిపించింది.

వచ్చినవాడు రవి అంది చెల్లాయి.

వాడు రవిశేఖరేనని తెలిసింది. అక్కకి. రవికి, శేఖర్‌కి మధ్యన ఒక క్రిమినల్ ఉన్నాడు. ఒక శాడిస్టు ఉన్నాడు. ఒక హంతకుడున్నాడు. ప్రమీలలో ప్రతీకారం ఉంది. ఆ పక్కనే చెల్లెలి మీద ప్రేమ ఉంది.

తన జీవితాన్ని నాశనం చేసిన హంతకుడ్ని అంతమొందించాలన్న కక్ష ఉంది. కానీ, చెల్లెలు ఇష్టపడ్డ అతన్ని క్షమించాలన్న సహనం కూడా ఉంది.

అమ్మా, నాన్న ఎంత వద్దన్నా వాళ్లను సముదాయించి పెళ్లి కొడుకుని, పెళ్లి కూతుర్ని లోపలికి ఆహ్వానించింది.

ప్రమీలది ప్రేమించే హృదయం. ప్రేమ పొందే అదృష్టం ఆమెకి లేదు. కానీ... చెల్లెలి ప్రేమని పండించే బాధ్యత అక్కగా తనకుంది.

అందుకే చెల్లెల్ని, మరిదిని హారతిచ్చి లోపలికి తీసుకొచ్చింది ప్రమీల.

రవితో నీల మెళ్ళో తాళిబొట్టు కట్టించింది.

✣ ✣ ✣

రవిశేఖర్‌కి తొలిరాత్రిని ఎవరితో... ఎలా అనుభవించాలో బాగా తెలుసు. అందుకే తాళి కట్టిన భార్యతో అంటీ ముట్టనట్టుగా వ్యవహరిస్తున్నాడు.

నీల మీద అతనికి ఏ కోరికా లేదు. అతని ఆశ, నీల ప్రేమకోసం పడ్డ ప్రయాస... అంతా ప్రమీల కోసమే!

ఇనిస్టిట్యూట్‌లో ప్రేమికుడిగా తను హారం వేసిందీ, రజనీని హతం చేసిందీ కూడా ప్రమీల కోసమే.

ఆ రాత్రి నీలని మభ్యపెట్టి, నిద్రపుచ్చి మేడమీద వ్యక్తావ్యక్త మనస్థితిలో.. అయోమయ స్థితిలో ఉన్న ప్రమీల దగ్గరకొచ్చాడు రవిశేఖర్.

"నీ కోసమే నీ చెల్లెల్ని పెళ్లి చేసుకున్నాను" అనే విషాన్ని కక్కాడు. ప్రమీల తల్లడిల్లిపోయింది. నిన్ను నేను ఇష్టపడలేదని నిక్కచ్చిగా చెప్పింది. "నువ్వు చేసిన హత్యకి, పోలీసులు నీకోసం గాలిస్తున్నారనీ, ఇప్పటికైనా బుద్ధిగా ఉండా"లని హెచ్చరించింది.

శేఖర్‌లో ఆనాటి మొండితత్వం వదలలేదు. రవి అనే ముసుగేసుకుని నీలని పెళ్లాడి ప్రమీలకి చేరువవ్వాలనే అతని దుష్ట సంకల్పం బుసలు కొడుతూ కనిపించింది. నయనా భయానా అతనికి నచ్చచెప్పచూసింది.

కానీ రవిశేఖర్‌ని ప్రమీల కంట్రోల్ చెయ్యలేకపోతోంది. ఒక్క క్షణంలో మేడ మీద నుండి పడిపోయినా బావుండుననిపించింది. కానీ ప్రమీల ఏ ప్రయత్నమూ చెయ్యక్కర్లేకుండానే నీల పైకొచ్చి రవిలోని నిజస్వరూపాన్ని అర్థం చేసుకుంది. వెంటనే కిందకెళ్ళి పోలీసులకి ఫోనుచేసి ఏడాదిగా దొరకని హంతకుడ్ని అరెస్టు చేయించింది.

నీల చేతిలో తాళిబొట్టు.

అది నీల, రవీ ఇంటిముందుకు రాగానే ప్రమీల కట్టించిన తాళిబొట్టు.

అది రజనీ ప్రమీలకి కడదామనుకున్న తాళిబొట్టు.